సాక్షి
తూర్పుగోదావరి

శనివారం । 25 । జనవరి । 2025



చార్జీల బాదుడుపై కొరడా

సంక్రాంతి పండగల వేళ అధిక చార్జీలు వసూలు చేసిన ప్రైవేటు ట్రావెల్స్ బస్సులపై రవాణా శాఖ 266 కేసులు నమోదు చేసి, రూ.15.15 లక్షల జరిమానా విధించింది.


II లో



నష్ట నివారణకు 'ఆయిల్‌బామ్‌'!

వరి సాగులో నష్టాలను ఎదుర్కొనేందుకు కోనసీమ జిల్లా రైతులు ఆయిల్ పామ్ సాగుకు ఇప్పుడిప్పుడే ముందుకు వస్తున్నారు. దీని సాగుకు జిల్లాలోని 11 మండలాలు అనుకూలమని గుర్తించారు.

9,745 క్యూసెక్కులు విడుదల




ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి గోదావరి డెల్టా కాలువలకు శుక్రవారం 9,745 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ఇందులో తూర్పు డెల్టాకు 2,875, మధ్య డెల్టాకు 1,870, పశ్చిమ డెల్టాకు 5 వేల క్యూసెక్కులు వదిలారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 9 అడుగులకు చేరింది.

న్యూస్‌రీల్

రికార్డ్ అసిస్టెంట్‌పై బదిలీ వేటు

- కోరుకొండ దేవస్థానంలో అపచారాలపై చర్యలు
- సీసీ కెమెరాలకు మరమ్మతులు



కోరుకొండ లక్ష్మీనరసింహస్వామి ఆలయం

సాక్షి ఇంపాక్ట్

మధురపూడి: కోరుకొండ శ్రీలక్ష్మీ నరసింహస్వామి దేవస్థానంలో ఇటీవల జరిగిన అపవిత్ర కార్యకలాపాలపై 'నిజాన్ని నిగ్గు తేల్చండి' శీర్షికన 'సాక్షి' ప్రచురించిన కథనానికి అధికారులు స్పందించారు. దేవస్థానం కార్యాలయంలో మద్యం సీసాలు, బిర్యానీ ప్యాకెట్లు ఉన్న ఫొటోలు వైరల్ అవడంపై 'సాక్షి' ఈ నెల 20న ఈ కథనం ప్రచురించింది. ఈ అపచారంపై వైఎస్సార్ సీపీ నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో కోరుకొండ ఆలయాన్ని దత్తత తీసుకున్న అన్నవరం దేవస్థానం ఈఓ వి.సుబ్బారావు శుక్రవారం ఒక ప్రకటనలో స్పందించారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. ఈ వివాదం నేపథ్యంలో కోరుకొండ దేవస్థానం రికార్డు అసిస్టెంట్ రవికుమార్‌ను రాజమహేంద్రవరంలోని ఆర్యాపురం సత్యనారాయణ స్వామి దేవస్థానానికి బదిలీ చేశారు. ఆయన స్థానంలో అన్నవరం దేవస్థానానికి చెందిన రాంజీని నియమించారు. అలాగే, కోరుకొండ దేవస్థానంలోని 12 సీసీ కెమెరాలు పూర్తి స్థాయిలో పని చేసేలా చర్యలు తీసుకున్నామని తెలిపారు. దేవస్థానం కార్యాలయం బయట ఉన్న బోర్డుపై తాళాలుంచుతూండటంతో అపరిచితులు లోపలకు చొరబడే అవకాశముందని గుర్తించారు. దీంతో కార్యాలయం తాళాలను ఉద్యోగులు, సిబ్బంది వద్దనే ఉంచాలని ఆదేశాలిచ్చారు. దేవస్థానం పర్యవేక్షణాధికారిగా గతంలోనే పి.వెంకట రమణను నియమించామని తెలిపారు.


ఆర్టీసీ పార్సిల్ కార్యాలయంలో 29న బహిరంగ వేలం

రాజమహేంద్రవరం సిటీ: ఆర్టీసీ పార్సిల్ సర్వీస్‌లో రవాణాకు వస్తువులు బుక్ చేసి, ఎవ్వరూ తీసుకుని వెళ్లని పార్సిళ్లకు ఈ నెల 29న రాజమహేంద్రవరంలో బహిరంగ వేలం నిర్వహిస్తున్నారు. ఏపీఎస్ ఆర్టీసీ అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్ (కమర్షియల్) మాధవ్ శుక్రవారం ఒక ప్రకటనలో ఈ విషయం తెలిపారు. ఆ రోజు ఉదయం 10.30 గంటలకు ఆర్టీసీ కాంప్లెక్స్‌లోని పార్సిల్ బుకింగ్ కార్యాలయం వద్ద ఈ వేలం నిర్వహిస్తామని, ఆసక్తి ఉన్నవారు పాల్గొనాలని కోరారు.

పకడ్బందీగా జేఈఈ మెయిన్స్

ప్రకాశం నగర్ (రాజమహేంద్రవరం): జేఈఈ మెయిన్స్ పరీక్షలను నగరంలోని అయాన్ డిజిటల్ జోన్, రాజీవ్‌గాంధీ విద్యా సంస్థల్లో మూడో రోజైన శుక్రవారం పకడ్బందీగా నిర్వహించామని కలెక్టర్ పి.ప్రశాంతి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 885 మందికి గాను 870 మంది, మధ్యాహ్నం 886 మందికి గాను 882 మంది హాజరయ్యారని వివరించారు.

వారికి రూ.కోట్లు.. గోదారికి తూట్లు



- జిల్లాలో బరి తెగించిన ఇసుక మాఫియా
- ప్రతి రోజూ సుమారు 600 లారీల్లో తరలింపు
- లారీ ఇసుక రూ.20 వేల నుంచి రూ.35 వేల వరకూ విక్రయం
- నెలకు సగటున రూ.21.60 కోట్ల అక్రమార్జన
- కూటమి నేతల కనుసన్నల్లో దందా
- మీనమేషాలు లెక్కిస్తున్న అధికార యంత్రాంగం

సాక్షి, రాజమహేంద్రవరం: అధికార కూటమి నేతల అండదండలతో ఇసుకాసురులు గోదావరిని గుల్ల చేస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా డ్రెడ్జింగ్‌తో నదీమతల్లిని గర్భశోకానికి గురి చేస్తున్నారు. ఇసుక తవ్వకాల పరిమితులు ముగిసినా లెక్క చేయకుండా ర్యాంపుల్లో యథేచ్ఛగా ఇసుక కొల్లగొడుతున్నారు. వెరసి దందా మూడు ట్రాక్టర్లు.. ఆరు లారీలు అన్న చందంగా సాగుతోంది. జిల్లాలోని కోటిలింగాల-2, గాయత్రి, కడియపులంక, తీపర్రు, పందలపర్రు, పెండ్యాల, కొవ్వూరు ఇసుక ర్యాంపుల్లో నిషేధిత డ్రెడ్జింగ్ అడ్డగోలుగా సాగుతోంది. ఆయా ర్యాంపులపై కూటమి నేతలు ఆధిపత్యం చెలాయిస్తున్నారు. వారి అడుగులకు కొందరు అధికారులు మడుగులొత్తుతూండటంతో అక్రమాలకు అంతు లేకుండా పోతోంది. ఒక్కో ర్యాంపు నుంచి రోజుకు సుమారు 100కు పైగా లారీల్లో ఇసుకను అక్రమంగా ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు. ఈవిధంగా రోజుకు 600 లారీల ఇసుక తరలిపోతోంది. లారీ ఇసుకను రూ.20 వేల నుంచి రూ.35 వేల వరకూ విక్రయిస్తున్నారు. సగటున రూ.30 వేలు అనుకున్నా రోజుకు రూ.1.80 కోట్ల చొప్పున నెలకు రూ.21.60 కోట్ల మేర ఇసుకాసురుల అవతారమెత్తిన కూటమి నేతల జేబుల్లోకి వెళ్తోంది.

ఇవన్నీ కళ్ల ముందు కనిపిస్తున్న పరిస్థితుల ఆధారంగా వేసిన లెక్కలే. అసలు లెక్క వేరే ఉందని పలువురు చెబుతున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడు మాసాలు దాటుతోంది. నూతన పాలసీ, అనుమతులు తదితర అంశాలను పక్కన పెడితే అధికారికంగా మూడు నెలల పాటు ఇసుక సరఫరా చేశారు. ఈ మూడు నెలల్లో కూటమి ప్రజా ప్రతినిధులు అధికారికంగా, అనధికారికంగా ఇసుక అక్రమ తవ్వకాలు, రవాణా ద్వారా రూ.1,200 కోట్లకు పైగా దండుకున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అక్రమార్కుల విషయం తెలిసినా.. అంతా బహిరంగంగానే జరుగుతున్నా.. కూటమి ఎమ్మెల్యేల అండదండలు ఉండటంతో మైనింగ్, జిల్లా అధికారులు కొందరు మామూళ్లు దండుకుని చూసీ చూడనట్లు వదిలేస్తున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.



కోటిలింగాల ర్యాంపులో బోటుతో ఇసుక డ్రెడ్జింగ్ (ఫైల్)

రాజమహేంద్రవరం అర్బన్‌లో..

కోటిలింగాల రేవు-2 ర్యాంపులో కూటమి నేతలు నిబంధనలను గోదారిలో తొక్కి మరీ యంత్రాలతో రాత్రి వేళ డ్రెడ్జింగ్ చేస్తూ నదిని గుల్ల చేస్తున్నారు. రాత్రి 11 గంటల తర్వాత మొదలవుతున్న ఈ దందా తెల్లవారుజాము వరకూ నిరాటంకంగా సాగుతోంది. ఇలా ఒక్క రాత్రిలోనే కోటిలింగాల రేవు-2 కేంద్రంగా సుమారు 100 లారీలకు పైగా ఇసుక అక్రమంగా రవాణా అవుతున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఉదయం ఏమీ తెలియనట్లు మిన్నకుండిపోతున్నారు.

రాజమహేంద్రవరం రూరల్‌లో..

నియోజకవర్గంలో బుర్రిలంక, ధవళేశ్వరం గాయత్రి ర్యాంపులు ప్రస్తుతం నడుస్తున్నాయి. కాతేరు, వెంకటనగరం ర్యాంపులకు ఇంకా అనుమతులు రాలేదు. ఇవన్నీ కూటమి నేతల కనుసన్నల్లోనే నడుస్తున్నాయి. ఓ ఎమ్మెల్యేకు ప్రధాన అనుచరులైన ఇద్దరి ఆధ్వర్యంలో వ్యవహారం నడుస్తోంది. ఒక్కో ర్యాంపునకు ఒక్కో ధర నిర్ణయించి మరీ వసూళ్లకు పాల్పడుతున్నారని సమాచారం. గాయత్రి ర్యాంపులో ఇసుక తవ్వుకునేందుకు 70 సొసైటీల వరకూ అవకాశం ఇచ్చారు. ప్రస్తుతం సుమారు 40 సొసైటీలు మాత్రమే నడుస్తున్నాయి. ఒక్కో సొసైటీ నుంచి నెలకు రూ.50 వేల చొప్పున ఇవ్వాలని ఎమ్మెల్యే అనుచరులు హుకుం జారీ చేయగా.. తమకు రాబడి రావడం లేదని, అంత ఇవ్వలేమని సొసైటీల ప్రతినిధులు చెప్పినట్లు తెలిసింది. ఈ ర్యాంపు నుంచి ప్రతి రోజూ వందకు పైగా లారీల ఇసుక విశాఖ, హైదరాబాద్‌కు అక్రమంగా తరలుతోందని సమాచారం.

కొవ్వూరులో..

ఈ నియోజకవర్గంలోని ఇసుక ర్యాంపులపై టీడీపీ నేతలు ఆధిపత్యం చలాయిస్తున్నారు. కొవ్వూరు ర్యాంపును పూర్తిగా తమ ఆధీనంలో ఉంచుకున్నారు. ర్యాంప్ ద్వారా వస్తున్న ఆదాయాన్ని పార్టీ కార్యాలయానికి వినియోగిస్తున్నట్లు సమాచారం. ఎరినమ్మ ర్యాంపును జనసేన, బీజేపీ నాయకులకు కేటాయించారు. ఈ ర్యాంపులో ఒక్కో బిల్లు నమోదుకు రూ.300 చొప్పున వసూలు చేస్తున్నట్లు ఆరోపణలున్నాయి. బిల్లు లేకుండా అయితే మరో రూ.500 అదనంగా దండుకుంటున్నారు. బిల్లు లేకుండా రూ.6,500 చొప్పున విక్రయిస్తున్నారు. ఔరంగబాద్-2 ర్యాంపు టీడీపీ నేతల కనుసన్నల్లో నడుస్తోంది. ద్విసభ్య కమిటీలోని ఓ నేత అన్నీ తానై వ్యవహరిస్తున్నట్లు ఆరోపణలున్నాయి. ఔరంగబాద్-2లో వేములూరు, తోగుమ్మి గ్రామాలకు చెందిన టీడీపీ నేతలకు భాగస్వామ్యం కల్పించినట్లు సమాచారం. దండగుండ ర్యాంపులో మాజీ ప్రజా ప్రతినిధి చక్రం తిప్పుతున్నారు. తనకు అనుకూలంగా ఉన్న యువకులకు ర్యాంప్ కేటాయించి, ఇసుక అక్రమ రవాణాతో రూ.లక్షలు దండుకుంటున్నారు. కొవ్వూరు, దండగుండ రేవు, ఎరినమ్మ, ఔరంగబాద్-2 ర్యాంపుల్లో బిల్లులు లేకుండానే దొడ్డిదారిలో తరలించేస్తున్నారు. ఇసుక అక్రమ తరలింపుల్లో ఓ ఎమ్మెల్యేకు సైతం భారీగా ముడుపులు అందుతున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

మంత్రి ఇలాకాలో..

రాష్ట్ర మంత్రి కందుల దుర్గేష్ ఇలాకా అయిన నిడదవోలు నియోజకవర్గంలో టీడీపీ, జనసేన నేతల అండదండలతో మూడు నెలలుగా అక్రమార్కులు యథేచ్ఛగా ఇసుక దోచేస్తున్నారు. పెరవలి మండలంలో తీపర్రు, కానూరు-పెండ్యాల, నిడదవోలు మండలంలో పందలపర్రు, జీడిగుంట ర్యాంపులు ఉన్నాయి. ఒక్కో ర్యాంపులో 75 వేల క్యూబిక్ మీటర్ల ఇసుక తవ్వకాలకు అనుమతులు ఇచ్చారు. తీపర్రు ర్యాంప్‌లో అంతంత మాత్రం తవ్వకాలు జరిగాయి. కానూరు-పెండ్యాల ర్యాంప్‌లో పరిమితికి మించి తవ్వేస్తున్నారు. 74 వేల క్యూబిక్ మీటర్ల మేర తవ్వాల్సి ఉండగా.. అంతకు రెట్టింపు తవ్వేశారు. రోజుకు 300 లారీలు, 150 ట్రాక్టర్లతో ఇసుక అక్రమంగా తరలించేస్తున్నారు. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో 100 నుంచి 125 లారీలు, 50 నుంచి 70 ట్రాక్టర్లకు ఇసుక ఎగుమతి చేస్తున్నట్లు రికార్డుల్లో చూపిస్తున్నారు. మూడు నెలల్లో అనుమతులకు మించి తవ్వేసినా.. కేవలం 22 వేల క్యూబిక్ మీటర్లు మాత్రమే తవ్వినట్లు చెబుతున్నారంటే దోపిడీ ఏ స్థాయిలో జరుగుతోందో అర్థం చేసుకోవచ్చు.

పర్యాటక ప్రదేశంగా కందుకూరి జన్మగృహం

కలెక్టర్ ప్రశాంతి



కందుకూరి జన్మగృహాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రశాంతి, కమిషనర్ కేతన్ గార్గ్

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): సంఘ సంస్కర్త కందుకూరి వీరేశలింగం జన్మగృహాన్ని పర్యాటక ప్రదేశంగా అభివృద్ధి చేయాలని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశించారు. నాటి చారిత్రక జ్ఞాపకాలను భవిష్యత్ తరాలకు అందించేలా నూతన సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించాలని సూచించారు. నగర పాలక సంస్థ కమిషనర్ కేతన గార్గ్, ఆర్కియాలజీ సహాయ సంచాలకుడు తిమ్మరాజు, ఇతర అధికారులతో కలిసి స్థానిక వంకాయలవారి వీధిలోని కందుకూరి జన్మ గృహాన్ని శుక్రవారం ఆమె సందర్శించారు. వితంతు వివాహ ఘట్టం, సమావేశ మందిరం, సమాలోచన మందిరం, వివేక వర్ధిని పుస్తకం ముద్రణ యంత్రం, లైబ్రరీ వంటి వాటిని పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, చారిత్రక నేపథ్యం కలిగిన ఈ గృహంలో నాటి స్మృతులు చెక్కు చెదరకుండా అభివృద్ధి పనులు చేపట్టాలని అన్నారు. నాటి ఘటనలకు అద్దం పట్టేలా త్రీడీ ఎఫెక్టుతో డాక్యుమెంటరీ ఫిల్మ్ రూపొందించి, సందర్శకులకు ప్రదర్శించాలని సూచించారు. మండువా లోగిలిలో చారిత్రక ఆధారాలను, నాడు కందుకూరి ఉపయోగించిన వస్తువులను సజీవంగా నిలిచేలా అభివృద్ధి చేయాలన్నారు. కమిషనర్ కేతన గార్గ్ మాట్లాడుతూ, పురావస్తు శాఖ, రాజమహేంద్రవరం కార్పొరేషన్ ఇంజినీరింగ్ అధికారులతో కలసి, చారిత్రక ఆధారాలను కాపాడి, భవిష్యత్ తరాలకు అందించటానికి ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నామని తెలిపారు.

రక్తదానంతో ప్రాణదాతలు కండి

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): రక్తదానం చేసి, ప్రాణదాతలు కావాలని జిల్లా ఔషధ నియంత్రణ సహాయ సంచాలకులు డి.నాగమణి ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఒక వ్యక్తి చేసే రక్తదానం ఒక కుటుంబాన్నే నిలబెడుతుందని అన్నారు. ఆలిండియా కెమిస్ట్, డ్రగ్గిస్ట్ అసోయేషన్ 50 వసంతాల వేడుక స్థానిక సీతంపేటలోని సంఘ కార్యాలయంలో శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా జిల్లావ్యాప్తంగా రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న నాగమణి మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ సేవా కార్యక్రమాలకు ప్రాధాన్యమివ్వాలని కోరారు. అసోసియేషన్ నాయకులు మాట్లాడుతూ, దేశవ్యాప్తంగా కెమిస్ట్, డ్రగ్గిస్ట్ సంఘాల ద్వారా లక్ష యూనిట్ల రక్తాన్ని సేకరిస్తున్నారని తెలిపారు. రాజమహేంద్రవరం శిబిరంలో 160 యూనిట్ల రక్తాన్ని ప్రభుత్వాసుపత్రికి అందించామన్నారు. కార్యక్రమంలో డ్రగ్ ఇన్‌స్పెక్టర్లు ఎ.కృష్ణ, పి.కల్యాణి, ఎం.విజయలక్ష్మి, అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు ఆర్.శ్రీనివాసరావు, పి.గణపతి, కోశాధికారి కె.శ్రీనివాసరావు, మాజీ ఉమ్మడి రాష్ట్ర అధ్యక్షుడు బలభద్ర వెంకటరాజు, నగర అధ్యక్షులు పిల్లా బాల, టీవీవీజే మోహనరావు, సంఘం 19 మండలాల అధ్యక్ష, కార్యదర్శులు, సభ్యులు పాల్గొన్నారు.

నేరస్తులకు కళ్లెం వేసేలా..



చెక్‌పోస్టు వద్ద తనిఖీ చేస్తున్న పోలీసులు

- కొత్తగా 9 పోలీస్ చెక్‌పోస్టులు
- జిల్లా ఎస్పీ నరసింహ కిశోర్ వెల్లడి

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): ఇటీవల జరుగుతున్న నేరాలను దృష్టిలో పెట్టుకుని, జిల్లా వ్యాప్తంగా 9 పోలీస్ చెక్‌పోస్టులు ఏర్పాటు చేశారు. జిల్లా ఎస్పీ డి.నరసింహ కిశోర్ శుక్రవారం ఈ విషయం తెలిపారు. నేరం చేసి తేలికగా తప్పించుకునే మార్గాలను నేరస్తులు ఇటీవల ముందుగా ఎంచుకుంటున్నారు. ఆ కోవలోనే రాజమహేంద్రవరం, కొవ్వూరు ప్రాంతాల్లో ఈ నెల 22న ఏకకాలంలో ఆరు ప్రాంతాల్లో గొలుసు చోరీలు జరిగాయి. ఆయా సంఘటన స్థలాల నుంచి శివారు రోడ్డు మార్గాల ద్వారా నేరస్తులు పరారయ్యారు. ఈ నేపథ్యంలో నేరం జరిగిన వెంటనే నేరస్తులను పట్టుకునేలా జిల్లావ్యాప్తంగా కొవ్వూరు శివారు బ్రిడ్జి, రాజమహేంద్రవరం శివారు కొంతమూరు గామన్ ఇండియా బ్రిడ్జి, రాజానగరం శివారు, మోరంపూడి, ఐఎల్‌టీడీ తదితర 9 ప్రాంతాల్లో పోలీస్ చెక్‌పోస్టులు ఏర్పాటు చేశారు. తద్వారా పరారయ్యే నేరస్తులు కచ్చితంగా పట్టుబడేలా ఎస్పీ ప్రణాళిక రూపొందించారు. ఒకో చెక్ పోస్టు వద్ద ఒక ఎస్సై, ఒక ఏఎస్సైతో నలుగురు కానిస్టేబుళ్లు ఉంటారు. వీరు 24 గంటల పాటు మూడు షిఫ్టులలో విధులు నిర్వర్తిస్తారని ఎస్పీ తెలిపారు.

ఐఆర్ రాదు.. డీఏ లేదు

- పెండింగ్‌లో ఉన్న రెండు కరవు భత్యాల ఊసెత్తని సర్కార్
- పీఆర్సీని నియమించాలని డిమాండ్ చేస్తున్న ఉద్యోగ సంఘాలు
- ఐఆర్‌పై ప్రకటన కోసం ఎదురుచూపులు
- ఉమ్మడి జిల్లాలో 80వేల మంది ఉద్యోగులు, పెన్షన్‌దారులు



రాయవరం: ఎన్నికల ముందు ఉద్యోగులను ప్రసన్నం చేసుకునేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పలు హామీలు ఇచ్చారు. ప్రభుత్వం ఏర్పడిన వెంటనే డీఏలపై ప్రకటన వస్తుందని, 12వ పీఆర్సీ చైర్మన్‌ను ప్రకటిస్తారని, పీఆర్సీ ఇచ్చేలోగా మధ్యంతర భృతి (ఐఆర్) ఇస్తారని ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు ఆశించారు. ప్రభుత్వం ఏర్పడి ఏడు నెలలు దాటినా వాటి విషయం పట్టించుకోలేదు. ఇటీవల జరిగిన రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో పెండింగ్ డీఏలు, పీఆర్సీ చైర్మన్‌ను నియమించి, ఐఆర్ ప్రకటిస్తారని అందరూ ఆశించారు. సంక్రాంతి కానుకగానైనా ఇస్తారని ఆయా వర్గాలు ఆశించినప్పటికీ, అటువంటి ప్రకటన ఏదీ రాకపోవడంతో ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు డీలా పడ్డారు. పీఆర్సీ చైర్మన్‌ను నియమించి, నివేదిక ఇచ్చేలోగా ఇంటెర్మ్ రిలీఫ్ (మధ్యంతర భృతి) కోసం ఉద్యోగులు ఎదురుచూపులు చూస్తున్నారు. ఇప్పటికే రెండు విడతల కరువు భత్యం(డీఏ) బకాయిలు ఉన్న నేపథ్యంలో ఐఆర్‌పై ప్రభుత్వం ఎటువంటి నిర్ణయం తీసుకుంటుందన్న ఉత్కంఠ ప్రభుత్వ ఉద్యోగులతో పాటు పెన్షనర్లలో నెలకొంది.

పీఆర్సీ కమిషన్ చైర్మన్ ఎప్పుడు?

వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో 12వ పీఆర్సీ చైర్మన్‌ను నియమించారు. అయితే ఆయన బాధ్యతలు స్వీకరించలేదు. 2024 మే నెలలో సాధారణ ఎన్నికల అనంతరం చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించారు. ఎన్నికల ముందు ఉద్యోగులు, ఉపాధ్యాయులకు ఇచ్చిన హామీ మేరకు 12వ పీఆర్సీ కమిషన్ చైర్మన్‌ను నియమించాల్సి ఉంది. కమిషన్ చైర్మన్‌ను నియమించిన వెంటనే మధ్యంతర భృతిని మంజూరు చేయాల్సి ఉంది.

43 శాతానికి మించి ఇస్తారా..

2014లో అప్పటి ముఖ్యమంత్రి ఎన్.కిరణ్‌కుమార్ రెడ్డి పీఆర్సీ నివేదిక ఇచ్చేలోగా 2014 ఫిబ్రవరిలో 27శాతం ఐఆర్‌ను ప్రకటించారు. పీఆర్సీ నివేదికను రాష్ట్ర విభజన జరిగిన తేదీని ప్రాతిపదికగా తీసుకుని, అప్పటి నుంచి ఆర్థిక లబ్ధిని కల్పించారు. 43శాతం ఫిట్‌మెంట్‌తో కిరణ్‌కుమార్‌రెడ్డి అనంతరం వచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పీఆర్సీని అమలు చేశారు. అయితే పీఆర్సీ అరియర్ల విషయంలో మాత్రం శీతకన్ను వేశారు. ఎన్నో విజ్ఞాపనలు, ఆందోళనలతో ఎట్టకేలకు 2016 అక్టోబర్ నుంచి సీపీఎస్ ఉద్యోగులకు మూడు విడతలుగా, రెగ్యులర్ ఉద్యోగులకు ఒక విడతగా పీఆర్సీ అరియర్లు చెల్లించారు. ఎన్నికలు సమీపిస్తున్నందునే అరియర్లు ఇచ్చారనే ఆరోపణలు కూడా అప్పట్లో విన్పించాయి. ఇప్పుడు కూడా అదేవిధంగా 43 శాతానికి మించి ఫిట్‌మెంట్ ఇవ్వాలనే డిమాండ్ ఉద్యోగులు, ఉపాధ్యాయుల నుంచి విన్పిస్తోంది.

ఆందోళనకు సిద్ధం

పీఆర్సీ ప్రకటించిన తర్వాత నివేదిక వచ్చేలోపు ఐఆర్ ఇవ్వడం ఆనవాయితీగా వస్తోంది. పీఆర్సీ కమిషన్‌ను నియమించిన తర్వాత నివేదిక ఇవ్వడానికి సాధారణంగా ఏడాది సమయాన్ని ఇస్తారు. పీఆర్సీ కమిటీ నియామకం అయిన తర్వాత వివిధ ఉద్యోగ సంఘాల నుంచి ప్రతిపాదనలు స్వీకరించాల్సి ఉంటుంది. పీఆర్సీ కమిటీ నివేదిక వచ్చేలోగా ప్రకటించాల్సిన మధ్యంతర భృతి కోసం ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు ఎదురుచూస్తున్నారు. ఐఆర్ ఇవ్వాల్సిందేనంటూ వివిధ ఉద్యోగ సంఘాలు ఇప్పటికే డిమాండ్ చేస్తున్నాయి. ఐఆర్ ప్రకటన కోసం ఉద్యోగ, ఉపాధ్యాయ జేఏసీ ఆధ్వర్యంలో ఆందోళనలకు సిద్ధమవుతున్నారు.

డీఏలు ఇచ్చేదెన్నడు?

ప్రతి ఆరు నెలలకు ఒకసారి దేశవ్యాప్తంగా ధరల సూచి ఆధారంగా కేంద్ర ప్రభుత్వం కరవు భత్యం ప్రకటిస్తుంది. దాన్ని అనుసరించి రాష్ట్ర ప్రభుత్వం రేషియో ప్రకారం డీఏ ఇవ్వాల్సి ఉంది. గతేడాది జనవరి, జూలైలో కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన డీఏ ఆధారంగా రాష్ట్ర ప్రభుత్వం రెండు డీఏలను ఇవ్వాల్సి ఉంది. ఈ నెల పోతే మరో డీఏను కేంద్ర ప్రభుత్వం ప్రకటించనుంది. అయినప్పటికీ రెండు డీఏలను ఇప్పటికీ ఇవ్వక పోవడాన్ని ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల నాయకులు ప్రశ్నిస్తున్నారు. వెంటనే రెండు డీఏలను ప్రకటించి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు ఉద్యోగులపై ఉన్న ప్రేమను నిరూపించుకోవాలని ఉద్యోగ సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

ఉమ్మడి జిల్లాలో ఉద్యోగుల పరిస్థితి ఇదీ..

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో వివిధ శాఖల్లో ఉద్యోగులు, ప్రభుత్వ పాఠశాలల్లో ఉద్యోగులు కలిసి సుమారు 42వేల వరకు ఉండగా, పెన్షనర్లు 38వేల వరకు ఉన్నట్లు సమాచారం. వీరందరూ రెండు విడతల కరవు భత్యంతో పాటు, 12వ పీఆర్సీ మధ్యంతర భృతి ప్రకటనకు ఎదురుచూస్తున్నారు.

గొంతెమ్మ కోర్కెలు కోరడం లేదు



ఉద్యోగులు, ఉపాధ్యాయులు గొంతెమ్మ కోర్కెలు కోరడం లేదు. రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక ఇబ్బందులు సాకుగా చూపి తప్పించుకోవాలని చూస్తే ఊరుకునేది లేదు. మధ్యంతర భృతిని ప్రభుత్వం వెంటనే ప్రకటించాలి. సీపీఎస్ రద్దు చేస్తూ అసెంబ్లీలో తీర్మానం చేయాలి.

– గొల్లవిల్లి నరేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి, ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం, కోనసీమ జిల్లా

ఐఆర్ ప్రకటించాలి



అందరికీ ఆమోదయోగ్యమైన ఐఆర్‌ను ప్రభుత్వం ప్రకటించాలి. పెండింగ్ డీఏలను విడుదల చేయాలి. ఆర్థిక పరమైన బకాయిలను విడుదల చేయాలి. న్యాయబద్ధమైన సమస్యలను పరిష్కరించకుంటే పోరాట బాటను పట్టాల్సి వస్తుంది.

– చింతాడ ప్రదీప్‌కుమార్, అధ్యక్షుడు, పీఆర్‌టీయూ, కాకినాడ జిల్లా

పోరాటాలు ఉధృతం చేయాలి



ప్రభుత్వం వెంటనే పీఆర్సీ కమిటీని ప్రకటించాలి. పీఆర్సీ కమిటీని నియమించిన వెంటనే ఐఆర్‌ను ప్రకటించాలి. రెండు విడతల డీఏలను వెంటనే ప్రకటించి ఉపాధ్యాయుల పెట్టుకున్న నమ్మకాన్ని నిలుపుకోవాలి. డిమాండ్లను పరిష్కరించకుంటే జేఏసీ పక్షాన, యూటీఎఫ్ పక్షాన పోరాటాలు ఉధృతం చేస్తాం.

– పి.సురేంద్రకుమార్, జిల్లా అధ్యక్షుడు, యూటీఎఫ్, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా

30 శాతం ఐఆర్ ఇవ్వాలి



రాష్ట్ర ప్రభుత్వంపై ఉద్యోగులు, ఉపాధ్యాయులు నమ్మకం పెట్టుకున్నారు. వారి నమ్మకాన్ని వమ్ము చేయకుండా 30శాతం ఐఆర్‌ను ప్రకటించాలి. పీఎఫ్ అరియర్స్, ఏపీజీఎల్ఐ, డీఏ అరియర్స్, పీఆర్సీ అరియర్స్‌ను వెంటనే విడుదల చేయాలి.

– పోతంశెట్టి దొరబాబు, జిల్లా అధ్యక్షుడు, ఎస్టీయూ, కోనసీమ జిల్లా

క్లుప్తంగా

వ్యక్తి దారుణ హత్య



కిలాని పోతురాజు (ఫైల్)

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): నగరంలోని వీరభద్రపురంలో ఒక వ్యక్తి హత్యకు గురయ్యాడు. శుక్రవారం రాత్రి జరిగిన ఈ ఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. కొంతమూరుకు చెందిన కిలాని పోతురాజు (48) భవన నిర్మాణాలకు సంబంధించి సెంట్రింగ్ కాంట్రాక్టు చేస్తుంటాడు. అతడు ప్రతి రోజూ పని ముగించుకుని సెంట్రింగ్ పనివారందరూ కలుసుకునే ప్రాంతమైన వీరభద్రపురానికి వచ్చి, వారితో మాట్లాడి వెళుతుంటాడు. ఇదే మాదిరిగా శుక్రవారం రాత్రి అక్కడకు వచ్చి, పనివారు, స్నేహితులతో కొంత సేపు మాట్లాడి తన బైక్‌పై కంబాలచెరువు వైపునకు బయలుదేరాడు. ఇన్‌కంట్యాక్స్ కార్యాలయం వెనుక సందులోకి వచ్చేసరికి గుర్తుతెలియని వ్యక్తి అతడి బండికి అడ్డంగా వచ్చి ఆపి పొడిచి పారిపోయాడు. తీవ్ర గాయాలతో కొట్టుమిట్టాడుతున్న పోతురాజును అటుగా వెళ్తున్న కొందరు చూసి కేకలు పెట్టారు. సమీపంలోని ప్రజలు అక్కడకు చేరుకుని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అయితే అప్పటికే పోతురాజు మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితి సమీక్షించారు. క్లూస్ టీం వచ్చి ఆధారాలు సేకరించింది. మృతుడికి ఎవరితోనూ విభేదాలు లేవని, స్నేహపూర్వకంగానే ఉంటాడని అతడి బంధువులు, స్నేహితులు చెబుతున్నారు. పోతురాజుకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ప్రభుత్వాస్పత్రిలో ఉంచారు. ఈ హత్యకు వివాహేతర సంబంధమే కారణమని పోలీసులు అనుమానిస్తున్నారు.

నష్ట నివారణకు ఆయిల్‌బామ్!

- వరి సాగులో నష్టాల నివారణకు ప్రత్యామ్నాయ సాగు
- కోనసీమ జిల్లాలోని 11 మండలాలు సాగుకు అనుకూలం
- ఆయిల్ పామ్ మొక్కల సరఫరాకు 2 కంపెనీలతో ఒప్పందం
- ఉద్యాన శాఖ ద్వారా రాయితీ సౌకర్యం



డాక్టర్ జి.కోటేశ్వరరావు, కొత్తపేట ఉద్యాన అధికారి

కొత్తపేట: ఆయిల్ పామ్ ఇప్పటి వరకు మెట్ట ప్రాంతాలలో మాత్రమే సాగు చేస్తున్నారు. కోనసీమ జిల్లాలో చాలావరకు లంక, మెట్ట ప్రాంతాలలో ఆయిల్ పామ్ సాగుకు రైతులు ఇప్పుడిప్పుడే ముందుకు వస్తున్నారు. అయితే ఈ జిల్లాలో ఎక్కువ భూమి డెల్టా ప్రాంతాలలో వరి సాగు కింద ఉండడం వల్ల రైతులు వరి పంట సాగుకే ఆసక్తి చూపుతున్నారు. ఆయిల్ పామ్ సాగుకు ముందుకు రావడానికి ఆలోచిస్తున్నారు. వారి అనుమానాలను నివృత్తి చేసి, ఆయిల్ పామ్ సాగు వైపు మళ్లించేలా ఉద్యాన శాఖ రైతులను చైతన్యవంతులను చేస్తోంది. ప్రస్తుతం వరి పండించే రైతులు ప్రకృతి వైపరీత్యాలు ముఖ్యంగా తుపాను, భారీ వర్షాలు, చీడపీడలు కారణంగా నష్టాలను చవి చూస్తున్నారు. ఇటువంటి పరిస్థితుల్లో వరికి ప్రత్యామ్నాయ పంటల కోసం చాలా మంది ఎదురుచూస్తున్నారు. దానిలో భాగంగా వరిలోను ఆయిల్ పామ్ సాగు చేయవచ్చని ఉద్యాన శాఖ అధికారులు సూచించారు. ప్రత్యేక పద్ధతి ద్వారా రెండు మూడు సంవత్సరాలు శ్రద్ధ వహిస్తే తదుపరి 30 సంవత్సరాల వరకు ఆయిల్ పామ్ ద్వారా ఆదాయం వస్తూనే ఉంటుందంటున్నారు.



ఆత్రేయపురం మండలం అంకంపాలెం వరి చేలో పెరుగుతున్న ఆయి పామ్ మొక్కలు

నోటిఫై చేసిన ఉద్యాన శాఖ

జిల్లాలోని 22 మండలాల్లో 11 ఆయిల్ పామ్ సాగుకు అనుకూలమైనవని ఏలూరు జిల్లా పెదవేగి ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఆయిల్ పామ్ రీసెర్చ్ సెంటర్ నివేదిక ఇచ్చింది. ఉద్యాన శాఖ జిల్లాలోని 11 మండలాలను ఆయిల్ పామ్ సాగుకు అనుకూలమైనవిగా నోటిఫై చేసింది. ఈ వివరాలను కొత్తపేట ఉద్యాన అధికారి డాక్టర్ జి.కోటేశ్వరరావు ‘సాక్షి’కి వివరించారు. జిల్లాలో రైతులు నాటుకోవడానికి కావలసిన ఆయిల్ పామ్ మొక్కలను సరఫరా చెయ్యడానికి సర్వే సాయి ఏడిబుల్ ఆయిల్స్ ప్రైవేట్ లిమిటెడ్, పతంజలి ఇండస్ట్రీస్ అనే రెండు కంపెనీలు ఉద్యాన శాఖతో అవగాహన ఒప్పందం చేసుకున్నాయి.

డెల్టా ప్రాంతాలూ అనువైనవే..

ఆ తరువాత జిల్లాలో ఆయిల్ పామ్ సాగు కోసం ప్రదర్శన క్షేత్రాలను గుర్తించి ఉద్యాన శాఖ ద్వారా రాయితీతో మొక్కలను కొంతమంది రైతుల వరి పొలాల్లో నాటించారు. దీని ద్వారా రైతులను ప్రోత్సహించి జిల్లాలో ఆయిల్ పామ్ విస్తీర్ణాన్ని పెంచనున్నారు. రాష్ట్రంలోని ఇతర జిల్లాలో ఆయిల్ పామ్ సాగుకు అనువైన వాతావరణం విషయంలో నిపుణులు శాస్త్రవేత్తల కమిటీ ముందుగా మెట్ట ప్రాంతాలను ప్రతిపాదించారు. అనంతరం జరిగిన సర్వేలో కోనసీమ, తూర్పుగోదావరి తదితర జిల్లాల్లోని డెల్టా ప్రాంతాలను అనువైనవిగా గుర్తించారు.

రైతుల అపోహలు తొలగించే చర్యలు

వరి పొలాలలో ఆయిల్ పామ్ సాగు విషయంలో రైతులకు కొన్ని అపోహలు ఉన్నాయి. వరిలో సాగు నీరు పారించినప్పుడు ఆయిల్ పామ్ ఎదుగుదలకు ప్రతిబంధకంగా ఉంటుందని వారి అనుమానం. ఈ విషయంలో సర్వే సాయి ఎడిబుల్ ఆయిల్స్ సంస్థ రైతులకు అవగాహన కల్పించే చర్యలు తీసుకుంది. సొంత ఖర్చుతో ఒక పద్ధతి ద్వారా అంతర పంటగా ఆయిల్ పామ్‌లో మొదటి 2–3 సంవత్సరాల వరకు వరిని పండించవచ్చని తెలిసేలా పొలాలను నిర్వహిస్తోంది. మొక్క చుట్టూ ఒకటిన్నర నుంచి రెండు అడుగులు కైవారం వరకు మట్టి దిమ్మలు ఏర్పాటు చెయ్యాలి. దానిలో మొక్కను సజావుగా పెంచవచ్చని నిరూపిస్తున్నారు. నాలుగో సంవత్సరం నుంచి దిగుబడి వస్తుంది. బహుళ వార్షిక పంటలైన కోకో, మిరియాలు, పిప్పళ్లు తదితర పంటలను కూడా సాగు చేయవచ్చు.

జిల్లాలో సాగు విస్తీర్ణం

- ప్రస్తుతం కోనసీమ జిల్లాలో 1192.50 ఎకరాల విస్తీర్ణంలో ఆయిల్ పామ్ సాగు చేస్తున్నారు.
- 60 ఎకరాల వరి విస్తీర్ణంలో ఆయిల్ పామ్ సాగు చేపట్టారు.

ఉద్యాన శాఖ ద్వారా వివిధ రాయితీలు

- ఒక హెక్టార్‌కు 143 మొక్కలు పూర్తి రాయితీతో ఇస్తారు.
- అంతర పంటలు సాగు చేసుకునేలా ఆయిల్ పామ్ నాటిన తరువాత ఒక హెక్టార్‌కు సంవత్సరానికి రూ. 5,250 చొప్పున 4 సంవత్సరాలు వరకు ఇస్తారు.
- ఎరువుల రాయితీగా ఆయిల్ పామ్ నాటిన తరువాత ఒక హెక్టార్‌కు సంవత్సరానికి రూ.5,250 చొప్పున 4 సంవత్సరాల వరకు ఇస్తారు.
- ప్రస్తుతం ఆయిల్ పామ్ ఒక టన్ను గెలల ధర రూ.20,290 పలుకుతోంది.

అంబాజీపేట కొబ్బరి మార్కెట్



కొబ్బరి రకం	ధర (రూ.ల్లో)
కొత్తకొబ్బరి (క్వింటాల్)	14,000 – 14,500
కొత్తకొబ్బరి (రెండవ రకం)	9,500 – 10,000
కురిడీ కొబ్బరి (పాతవి)	
గండేరా (వెయ్యి)	20,000
గటగట (వెయ్యి)	17,500
కురిడీ కొబ్బరి (కొత్తవి)	
గండేరా (వెయ్యి)	19,000
గటగట (వెయ్యి)	17,000
నీటికాయ.పాత (ముక్కుడు)కాయ (వెయ్యి)	15,000 – 15,500
కొత్త (పచ్చి)కాయ (వెయ్యి)	15,500 – 16,000
కొబ్బరి నూనె (15 కిలోలు)	3,750
ఒక కిలో	260

ఇంటి సరిహద్దు వివాదంలో ఎనిమిది మందికి జైలు

నిడదవోలు రూరల్: మండలంలోని శంకరాపురం గ్రామంలో ఇంటి సరిహద్దు వివాదంలో ఎనిమిది మందికి 14 నెలల సాధారణ జైలు శిక్షతో పాటు ఒక్కొక్కరికి రూ.5,700 జరిమానా విధిస్తూ నిడదవోలు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి జి.రామకృష్ణ తీర్పు చెప్పినట్లు సమిశ్రగూడెం ఎస్సై కె.వీరబాబు శుక్రవారం తెలిపారు. శంకరాపురం గ్రామానికి చెందిన మోర్త లక్ష్మికి అదే గ్రామానికి చెందిన చదలవాడ రామకృష్ణకు ఇంటి సరిహద్దు దారి విషయంలో వివాదం చోటు చేసుకుంది. మోర్త లక్ష్మి కోర్టును ఆశ్రయించారు. ఈ ఘటనలో కోర్టు ఆర్డర్‌ను తిరస్కరించి 2016 ఏప్రిల్ 26వ తేదీన చదలవాడ సూర్యారావు, బీవీ సర్వేశ్వరరావు, పి.నాగేశ్వరరావు, రామకృష్ణ, నాగమణి, దావీదు, కె.సత్యవతి, రాపాక వెంకటేశ్వరరావు లక్ష్మి ఇంటికి వెళ్లి తగాదా పడి దాడిచేయడంతో పాటు చంపుతామని బెదిరించడంతో అప్పటి ఎస్సై కె.నరేంద్రకు ఫిర్యాదు చేసింది. నేరం రుజువు కావడంతో 8 మందికి జైలు శిక్షతో పాటు జరిమానా విధిస్తూ కోర్టు తీర్పు చెప్పినట్లు ఎస్సై వీరబాబు చెప్పారు.

హత్య కేసులో ముద్దాయికి జీవిత ఖైదు

రాజానగరం: మండలంలోని రాధేయపాలెంలో జరిగిన హత్య కేసులో ముద్దాయిగా ఉన్న తన్నీరు రాంబాబుకు జీవిత ఖైదును విధిస్తూ న్యాయమూర్తి డబ్బిరి విజయ్‌గౌతం శుక్రవారం తీర్పునిచ్చారు. ఇందుకు సంబంధించి స్థానిక సీఐ వీరయ్యగౌడ్ తెలిపిన వివరాలావున్నాయి. రాధేయపాలెంకు చెందిన కొప్పిరెడ్డి వెంకన్నను హత్య చేసి, తన్నీరు వెంకన్నబాబును గాయపరిచాడనే అభియోగంపై 2020లో అప్పటి సీఐ ఎంవి సుభాష్ ఐపీసీ సెక్షన్లు 302, 307, 326 కింద కేసు నమోదుచేసి, ముద్దాయి రాంబాబును అరెస్టు చేశారు. విచారణలో అతని పై మోపిన అభియోగాలు నిజమని తేలడంతో ముద్దాయికి జీవిత ఖైదుతోపాటు రూ. ఐదు వేలు జరిమానా విధిస్తూ 5వ అదనపు సెషన్స్ జడ్జి తీర్పునిచ్చారన్నారు. ఈ కేసులో ప్రాసిక్యూషన్ తరపున శంభుప్రసాద్, లక్ష్మణ్‌నాయక్ వాదనలు వినిపించారు.

మార్కెట్‌లోకి కియా సిరోస్ ఎవోల్వ్ బై ది ఫ్యూచర్ కారు



మార్కెట్‌లోకి విడుదలైన కియా సిరోస్ ఎవోల్వ్ బై ది ఫ్యూచర్ కారు

రాజమహేంద్రవరం సిటీ : నగరంలోని కంటిపూడి కియాషోరూంలో శుక్రవారం కియా సిరోస్ ఎవోల్వ్ బై ది ఫ్యూచర్ కార్‌ను డీటీఓ (డిస్ట్రిక్ట్ ట్రాన్స్‌పోర్ట్ ఆఫీసర్) ఆర్.సురేష్ మార్కెట్ లోకి విడుదల చేశారు. ఈ సందర్భంగా కంటిపూడి కియా సీఈఓ కామేష్ మాట్లాడుతూ ఈ కారు శక్తివంతమైన పెట్రోల్, డీజిల్ ఇంజిన్, ఆటో అండ్ మాన్యువల్ ట్రానిక్ లెవెల్ 2 అడస్ ఫీచర్స్, 6 ఎయిర్ బ్యాగులు, డ్యూయల్ పానారోమిక్ సన్రూఫ్, 12.3 ఇంచ్ టచ్ స్క్రీన్ నావిగేషన్ కాక్పిట్, హార్మన్ కార్డన్ ప్రీమియం 8 స్పీకర్స్ సౌండ్ సిస్టమ్‌తో కియా కనెక్ట్ 2., ఓటీఏ సాఫ్ట్వేర్ అప్డేట్స్ విత్ కియా రిమోట్ డయాగ్నోస్టిక్స్, స్మార్ట్ ఎయిర్ ప్యూరిఫయర్ విత్ ఏక్యూఐ డిస్ ప్లే, స్మార్ట్ డాష్ కామ్ విత్ డ్యూయల్ కెమెరా ఇలాంటి ఇంకెనో అత్యాధునిక ఫీచర్స్‌తో అందుబాటులో ఉందన్నారు. కంటిపూడి గ్రూప్ చైర్మన్ కంటిపూడి సర్వారాయుడు, మేనేజింగ్ డైరెక్టర్ కె.వినయ్ బాబు, ఎం.జగన్, సీహెచ్ సత్యనారాయణమూర్తి (చినబాబు), కె.మన్మోహన్‌రామ్ పాల్గొన్నారు.

ఆన్‌లైన్ మోసాలతో రూ.48 లక్షలకు టోకరా

- అమలాపురంలో నిజామాబాద్ సైబర్ క్రైమ్ డీఎస్పీ విచారణ
- ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసి తీసుకెళ్లిన వైనం
- విచారణకు పిలిచినప్పుడు రావాలని ఓ మహిళకు ఆదేశం

అమలాపురం టౌన్: రూ.లక్ష చెల్లిస్తే రూ.3 లక్షలు ఇస్తామని వాట్సాప్‌లో వస్తున్న యాప్‌లకు ఆకర్షితులై ఆన్‌లైన్ ద్వారా నగదు పంపించిన సైబర్ నేరం అమలాపురంలో జరిగింది. అమలాపురంలో ముగ్గురు వ్యక్తులు ఈ యాప్‌లతో ఆన్‌లైన్ ద్వారా రూ.48 లక్షలు చెల్లించారు. అవి అక్రమ లావాదేవీలని గుర్తించిన తెలంగాణ రాష్ట్రం నిజామాబాద్ సైబర్ పోలీసులు రంగంలోకి దిగారు. నిజామాబాద్‌లో ఓ బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు సైబర్ క్రైమ్ డీఎస్పీ వెంకటేశ్వరావుతో కూడిన బృందం శుక్రవారం పట్టణానికి వచ్చి వస్త్ర దుకాణ యాజమాని తిలక్, సురేష్ (రాజోలు)లను ఈ నేరంలో నిందితులుగా గుర్తించి తమ వెంట తీసుకువెళ్లారు. ఈ నేరానికి సంబంధించి ఓ మహిళను తాము విచారణకు రమ్మన్నప్పుడు రావాలని డీఎస్పీ వెంకటేశ్వరరావు ఆదేశించారు.

బ్యాంక్ అకౌంట్ వేరొకరికి అప్పగించడం నేరం

పట్టణానికి చెందిన తిలక్ వస్త్ర దుకాణంలో పనిచేస్తున్న ఓ మహిళ తన దుకాణ యాజమానికి చెందిన బ్యాంక్ అకౌంట్‌ను ఆ దుకాణ యాజమాని అనుమతితోనే తనకు తెలిసిన సురేష్‌కు ఇచ్చింది. ఆ వ్యక్తే ఆన్‌లైన్‌లో ఆ అకౌంట్ ద్వారా రూ.48 లక్షల వరకూ పంపాడు. అందులో కొంత మొత్తాన్ని వస్త్ర దుకాణ యాజమానికి, మరికొంత మొత్తాన్ని తనకు అకౌంట్ ఇచ్చిన మహిళకు బదిలీ చేశాడు. అయితే ఈ బ్యాంక్ అకౌంట్ ద్వారా జరిగిన లావాదేవీలన్నీ పూర్తిగా చట్ట విరుద్ధంగా జరిగినట్లు గుర్తించి గుజరాత్ సైబర్ క్రైమ్ పోలీసులు అమలాపురంలోని వస్త్ర దుకాణ యాజమానికి రెండు నెలల కిందటే నోటీసు పంపించారు. ఆ నోటీసును అతను పట్టించుకోకుండా పక్కన పడేశాడు. ఈ సైబర్ నేరానికి నిజామాబాద్‌లోని బాధితులకు కొందరికి లింకు ఉండడంతో అక్కడ సైబర్ క్రైమ్ పోలీసులు ఇక్కడకి వచ్చి బాధ్యులైన ఇద్దర్ని అరెస్ట్ చేసి కూడా తీసుకుని వెళ్లారు. అయితే వస్త్ర దుకాణ యాజమాని తిలక్ ఉద్దేశపూర్వకంగా తన అకౌంట్‌ను తన దుకాణంలో పనిచేసే మహిళకు ఇచ్చారా? ఆ మహిళ తనకు తెలిసిన వ్యక్తికి ఆ అకౌంట్ కావాలనే ఇచ్చిందా? ఆ అకౌంట్ ఆధారంగా సైబర్ నేరాలకు పాల్పడిన గుజరాత్‌లోని వ్యక్తులు ఎవరు? అనే విషయాలు సైబర్ క్రైమ్ పోలీసుల విచారణలో తేలాల్సి ఉంది. బ్యాంక్ అకౌంట్ అమ్మటం లేదా వేరే వ్యక్తులకు అప్పగించడం వంటి చర్యలు కూడా నేరమేనని నిజామాబాద్ సైబర్ క్రైమ్ డీఎస్పీ వెంకటేశ్వరరావు ‘సాక్షి’తో అన్నారు.

అంతర్ జిల్లాల కబడ్డీ పోటీలకు జట్టు పయనం

ప్రకాశం నగర్ (రాజమహేంద్రవరం) : విశాఖపట్నంలో ఈ నెల 25, 26, 27 తేదీల్లో జరిగే 71వ ఆంధ్రప్రదేశ్ అంతర్ జిల్లాల కబడ్డీ చాంపియన్ షిప్ పోటీలలో పాల్గొనేందుకు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా కబడ్డీ జట్టు శుక్రవారం బయలుదేరి వెళ్లినట్లు కన్వీనర్ ఏవీడీ ప్రసాదరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీలకు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా నుంచికబడ్డీ పురుషుల, స్త్రీల జట్ల ఎంపిక జరిగిందన్నారు. పుణ్యక్షేత్రంలో జరిగిన సెలక్షన్‌లో ఈ ఎంపికలు నిర్వహించినట్లు తెలిపారు.

తెగిపడిన హై టెన్షన్ రైల్వే విద్యుత్ కేబుల్

గోదావరి రైల్వే స్టేషన్‌లో రెండు గంటలు నిలిచిన రైలు



గోదావరి రైల్వే స్టేషన్‌లో విద్యుత్ లైన్‌కు మరమ్మతులు చేస్తున్న దృశ్యం

రాజమహేంద్రవరం సిటీ: స్థానిక గోదావరి రైల్వే స్టేషన్లో శుక్రవారం తెల్లవారు జామున హై టెన్షన్ విద్యుత్ కేబుల్ తెగి పడటంతో మచిలీపట్నం- విశాఖపట్నం(17219) రైలు సుమారు రెండు గంటల పాటు నిలిచి పోయింది. మచిలీపట్నం నుంచి విశాఖపట్నం వైపు వెళుతున్న ఈ రైలు తెల్లవారు జామున 3గంటల సమయంలో గోదావరి స్టేషన్‌కు వచ్చే సరికి విద్యుత్ వైరు తెగిపడటంతో భారీ శబ్దాలు వచ్చాయి. ప్రయాణికులు భయాందోళనకు గురయ్యారు. దీంతో రైలును రెండు గంటల పాటు నిలిపివేశారు. ఘటనా స్థలానికి ఆర్‌పీఎఫ్ అధికారులు, సంబంధిత అధికారులు చేరుకుని విద్యుత్ లైన్ మరమ్మతులు చేపట్టారు. రెండు గంటల అనంతరం రైలును విశాఖపట్నం వైపు పంపించారు. ఈ ఘటనలో ఎవరికీ ప్రమాదం జరగలేదని రైల్వే అధికారులు తెలిపారు.

ఘనంగా సరస్వతి హోమం



సరస్వతి హోమం నిర్వహిస్తున్న తిరుమల విద్యాసంస్థల సంస్థ చైర్మన్ తిరుమలరావు, సరోజినిదేవి దంపతులు

రాజమహేంద్రవరం రూరల్: మండలంలో కాతేరులో గల తిరుమల విద్యాసంస్థల ఆవరణలో శుక్రవారం నాగాభట్ల కామేశ్వరశర్మ ఆధ్వర్యంలో వింజమూరి సుబ్బారావు బృందం సరస్వతి హోమం ఘనంగా నిర్వహించారు. తిరుమల విద్యాసంస్థల చైర్మన్ నున్న తిరుమలరావు, సరోజినిదేవి దంపతులు ఈ హోమాన్ని దిగ్విజయంగా పూర్తిచేశారు. 18వేల మంది విద్యార్థులు, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది హోమద్రవ్యాలతో ఈ హోమంలో పాల్గొన్నారు. విద్యార్థులనుద్దేశించి తిరుమలరావు మాట్లాడుతూ విద్యతో పాటు, మంచిబుద్ధిని కలిగి ఉండాలని, తమ లక్ష్యాలను నెరవేర్చుకోవడంలో మన శ్రమ ఎంత ఉన్నప్పటికీ, ఆ భగవంతుని ఆశీస్సులు కూడా మనకు అవసరమని, మనపై మనకు విశ్వాసం పెంపొందించకోవడానికి ఈ హోమం ఎంతో బలాన్ని ఇస్తుందని ఆయన అన్నారు. తిరుమల విద్యాసంస్థల అకడమిక్ డైరెక్టర్ జి.సతీష్‌బాబు, ప్రిన్సిపాల్ వి.శ్రీహరి, విద్యార్థులు, ఉపాధ్యాయ, ఉపాధ్యాయేతర సిబ్బంది, శ్రేయోభిలాషులు పాల్గొన్నారు.

బాలిక అదృశ్యంపై కేసు నమోదు

కొవ్వూరు: దేచెర్ల గ్రామంలో తన 14 ఏళ్ల మైనర్ కుమార్తె ఇంటి నుంచి బయటికి వెళ్లి తిరిగిరాలేదని బాలిక తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు రూరల్ ఎస్సై కె.శ్రీహరిరావు తెలిపారు. కడియం మండలం వీరవరం గ్రామం తమ స్వగ్రామం అని పేర్కొన్నారు. ఈనెల 12వ తేదీన సంక్రాంతి పండుగ సందర్భంగా తన అత్తవారి గ్రామమైన దేచెర్లకి తన భార్య,ముగ్గురు పిల్లలు వచ్చామన్నారు. 23వ తేదీన స్వగ్రామానికి బయలు దేరగా పెద్ద కుమార్తె అయిన బాలిక ఇంటి నుంచి బయటికి వెళ్లి మళ్లీ తిరిగి రాలేదని బాలిక తండ్రి ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. పలుచోట్ల వెతికినప్పటికీ ఆమె ఆచూకీ లభ్యం కాకపోవడంతో శుక్రవారం ఫిర్యాదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

బాల్ బ్యాడ్మింటన్ ఇంటర్ యూనివర్సిటీ జట్టు ఎంపిక



జట్టుకు ఎంపికైన క్రీడాకారులు

నిడదవోలు: పట్టణంలోని ఎస్వీడీ ప్రభుత్వ మహిళా కళాశాలలో శుక్రవారం అంతర్ కళాశాలల బాల్ బ్యాడ్మింటన్ ఎంపిక పోటీలు నిర్వహించారు. రాజమహేంద్రవరం ఆదికవి నన్నయ్య యూనివర్శిటీ పరిధిలోని ఎనిమిది ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలల నుంచి 70 మంది క్రీడాకారులు హాజరయ్యారు. మహిళా క్రీడాకారుల మధ్య హోరాహోరీగా మ్యాచ్‌లు జరిగాయి. ప్రముఖ బాల్ బ్యాడ్మింటన్ క్రీడాకారుడు బండి రాంబాబు పోటీలను ప్రారంభించారు. ఈ ఎంపిక పోటీల్లో ఏలూరు సెయింట్ థెరిసా మహిళా డిగ్రీ కళాశాల జట్టు మొదటి స్థానం సాధించింది. కొత్తపేట వీకేవీ ప్రభుత్వ మహిళా కళాశాల ద్వితీయ స్థానం, నిడదవోలు ఎస్వీడీ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల జట్టు తృతీయ స్థానంలో నిలిచింది. పాల్గొన్న ఎనిమిది మహిళా బాల్ బ్యాడ్మింటన్ జట్ల నుంచి అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన పదిమందిని ఆల్ ఇండియా ఇంటర్ యూనివర్శిటీ జట్టుకు ఎంపిక చేశారు. వైస్ ప్రిన్సిపాల్ కంబయ్య, కళాశాల పీడీ అనూష, రిటైర్డు ఎంఈవో గాలి రాఘవయ్య, రిటైర్డ్ ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ సత్తి బాపిరెడ్డి, కౌన్సిలర్ పువ్వల రతీదేవి, స్పోర్ట్స్ కన్వీనర్ ఉషారాణి, పీఈటీలు శాంతి, ప్రసాద్, ప్రదీప్ అధ్యాపకులు పాల్గొన్నారు.

ఎంపికైన క్రీడాకారులు వీరే

వి.లక్ష్మీతులసి (కొత్తపేట), జె.దివ్య (నిడదవోలు), జి.పుణ్య (ఏలూరు), కె.గాయత్రి (అనపర్తి), ఆర్.వరలక్ష్మి(కొత్తపేట), జి.పూజ (ఏలూరు), పి.లీలారమణి (గోపన్నపాలెం), బి.మల్లిక (నిడదవోలు), ఎస్.నవ్యశ్రీ(తణుకు), జి.నాగవినయశ్రీ (ఏలూరు)

చార్జీల బాదుడుపై కొరడా

- రవాణాశాఖ పది రోజులు ప్రత్యేక డ్రైవ్
- నిబంధనల ఉల్లంఘనలపై కేసులు
- ఉమ్మడి జిల్లాలో 266 నమోదు
- రూ.15.15 లక్షల అపరాధ రుసుము



ట్రావెల్స్ బస్సు తనిఖీ చేస్తున్న రవాణాశాఖాధికారులు

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): సంక్రాంతి పండగను క్యాష్ చేసుకోవాలనుకున్న ప్రైవేట్ ట్రావెల్స్‌పై రవాణాశాఖ కొరడా ఝుళిపించింది. సంక్రాంతికి వివిధ ప్రాంతాల నుంచి సొంతూళ్లకు వేళ్లే వారి సంఖ్య విపరీతంగా ఉంటుంది. దీనిని దృష్టిలో ఉంచుకుని ప్రైవేట్ ఆపరేటర్లు బస్సులు నడుపుతుంటారు. ఈ బస్సులో సాధారణం కంటే అధిక చార్జీలు వసూలు చేస్తుంటారు. ఏడాదికి ఒకసారి సంక్రాంతికి వచ్చే అధిక ఆదాయం వదులుకోలేక తగిన ధ్రువపత్రాలు లేకుండా, ప్రభుత్వానికి నిర్ణీత పన్నులు చెల్లించకుండా బస్సులను తిప్పుతుంటారు. ఇలా నిబంధనలకు విరుద్ధంగా నడిచే ప్రైవేట్ ట్రావెల్స్‌కు అడ్డకట్ట వెయ్యడానికి రవాణాశాఖ అధికారులు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. ఈ తనిఖీల్లో ముఖ్యంగా లగేజీ రవాణా చేస్తున్నా, ప్రయాణికుల నుంచి అధిక చార్జీలు వసూలు చేసినా కేసులు రాశారు. బస్సు డాక్యుమెంట్లు, ట్యాక్స్ తదితర అంశాలను పరిశీలించారు. నిబంధనలకు విరుద్ధంగా ఉంటే రూ.వెయ్యి నుంచి రూ.10వేల వరకూ జరిమానా విధించారు. తెలంగాణ, కర్నాటక, తమిళనాడు నుంచి వచ్చే వాహనాలను ఈతకోట చెక్‌పోస్టు, దివాన్‌చెరువు, బెండపూడి చెక్‌పోస్టు వంటి ముఖ్య ప్రాంతాలలో తనిఖీలు చేస్తున్నారు. కాకినాడకు వచ్చే వాహనాల కోసం ప్రత్యేకంగా కరప మండలం నడకుదురు, సామర్లకోట ప్రాంతాలలో తనిఖీలు నిర్వహించారు. ప్రతి రోజూ ఉదయంతో పాటు సాయంత్రం 6 నుంచి మర్నాడు 6 గంటల వరకూ ప్రత్యేక తనిఖీలు చేపట్టారు. ఇందుకోసం ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేశారు. ఈ నెల 10 నుంచి 20 వ తేదీ వరకు నిర్వహించిన ప్రత్యేక డ్రైవ్‌లో భాగంగా ఉమ్మడి జిల్లాలో 266 కేసులు నమోదు చేసి రూ.15.15లక్షల అపరాధ రుసుము వసూలు చేశారు.

జరిమానాలు ఇలా..

జిల్లా	కేసుల సంఖ్య	అపరాధ రుసుము (రూ.లలో)
కాకినాడ	96	5,56,600
కోనసీమ	55	5,60,000
తూర్పుగోదావరి	115	3,93,000

అవగాహన కల్పిస్తున్నాం



రోడ్డు భద్రత మాసోత్సవాల్లో నెల రోజుల పాటు రోజుకో అంశంపై అవగాహన కల్పిస్తున్నాం. జాతీయ రహదారులపై డ్రంక్ డ్రైవ్‌తో పాటు ఇతర అంశాలకు సంబంధించి కేసులు నమోదు చేస్తున్నాం.

– కె.శ్రీధర్ జిల్లా రవాణాశాఖాధికారి, కాకినాడ జిల్లా

సోలో ట్రావెల్ సో బెటర్!

నేడు నేషనల్ టూరిజమ్ డే



పర్యటనలకు మనదేశం పుట్టిల్లు. తీర్థయాత్రలు మన సంస్కృతిలో భాగం. పర్యటన... ఒక పాఠం... రచనకు అదే మూలం. జీవన వైవిధ్యత అధ్యయనానికి ఓ మాధ్యమం. పర్యటనలు ఒత్తిడి నుంచి సాంత్వన కలిగిస్తాయి. జీవితాన్ని కొత్తగా చూడడానికి కళ్లు తెరిపిస్తాయి. అణగారిన జీవితేచ్ఛను తిరిగి చిగురింపచేస్తాయి. అందుకే... ఫ్రెండ్స్‌తో టూర్‌లు... ఫ్యామిలీ టూర్‌లు... అలాగే... మహిళల సోలో ట్రావెల్స్ కూడా పెరిగాయి.

మహిళలు ఒంటరిగా పర్యటనలు చేయడానికి సందేహించాల్సిన అవసరమేలేదిప్పుడు. ప్రపంచంలో మనుషులందరినీ కలిపే భాష ఇంగ్లిష్. మనదేశంలో పర్యటనలైనా, విదేశీ పర్యటనలైనా ఇంగ్లిష్ భాష వస్తే చాలు. అనర్గళంగా మాట్లాడే నైపుణ్యం లేకపోయినప్పటికీ మనకు అవసరమైన సమాచారాన్ని అడగగలగడం, చెప్పింది అర్థం చేసుకోవడం తెలిస్తే చాలు. సేఫ్టీ, సెక్యూరిటీ నియమాలు పాటిస్తూ ప్రయాణం కొనసాగిస్తే మహిళలు ఒంటరిగా ప్రయాణించినా సరే ఎటువంటి ఇబ్బందులూ ఎదురు కావన్నారు రజని లక్కా. ఆత్మవిశ్వాసం ఉండాలి, కనీసం ఆత్మవిశ్వాసంతో ఉన్నట్లు కనిపించి తీరాలి. బిత్తర చూపులు చూస్తే మోసగించేవాళ్లు అక్కడిక్కడే ప్రత్యక్షమవుతారు. మరో తప్పనిసరి జాగ్రత్త ఏమిటంటే సహ ప్రయాణికులతో కూడా డబ్బు లావాదేవీలు చేయకూడదు. అలాగే పర్యటనను ఆస్వాదించాలంటే లగేజ్ తక్కువగా ఉండాలి. ట్రావెల్ ఇన్సూరెన్స్ తప్పనిసరిగా తీసుకోవాలి. సోలోగా పర్యటనకు వెళ్లిన వాళ్లు ఇంట్లో వాళ్లకు ఎప్పటికప్పుడు సమాచారం ఇస్తుండాలి. అయితే లైవ్ లొకేషన్స్ ఇతరులకు ఎవ్వరికీ షేర్ చేయవద్దు. సోషల్‌మీడియాలో లైక్‌ల కోసం తాపత్రయపడి టూరిస్ట్ ప్లేస్‌లో ఫొటోలు తీసుకుని గంటకో పోస్ట్ పెడుతూ ఉంటే మన కదలికలు ఎప్పటికప్పుడు ప్రపంచానికి తెలిసిపోతుంటాయి. మనల్ని ఎవరైనా రహస్యంగా వెంటాడుతున్నట్లయితే చేజేతులా వారికి దారి చూపించినట్లవుతుంది. పర్యటన వివరాలను సోషల్ మీడియాలో ఫాలోవర్స్‌తో షేర్ చేయాలనుకుంటే పర్యటన పూర్తయి ఇంటికి వచ్చిన తర్వాత పోస్ట్ చేసుకోవచ్చు. ఇలాంటి కొన్ని జాగ్రత్తలతో ఒంటరిగా ప్రయాణం చేయవచ్చని చెబుతున్నారు జెన్నిఫర్. మనవాళ్లకు అడ్వెంచర్ టూర్‌లు చేయడం కంటే నియమాలను ఉల్లంఘించడంలో సాహసాన్ని ప్రదర్శిస్తుంటారు. ఫొటోగ్రఫీ నిషేధం అన్న చోట ఫొటోలు తీసుకుంటారు. సెక్యూరిటీ కళ్లు కప్పి నిషేధిత ప్రదేశాల్లోకి, డేంజర్ జోన్‌లలోకి దొంగచాటుగా వెళ్లే ప్రయత్నం చేస్తుంటారు. అలాంటి ప్రయత్నాలు ప్రమాదకరం మాత్రమే కాదు నేరం కూడా. పర్యటనను ఆస్వాదించడం కూడా ఒక కళ. ఎప్పటికీ వన్నె తగ్గని కళ.

మనదేశం ప్రపంచానికి ప్రతీక

కశ్మీర్‌లో తప్ప సోలో ట్రావెలర్‌గా మరెక్కడా నాకు ఇబ్బంది ఎదురుకాలేదు. తమిళనాడు ప్రజలు సింపుల్‌గా ఉంటారు. 76 దేశాల్లో పర్యటించిన తరవాత నాకనిపించిందేమిటంటే... ప్రపంచంలో ఉన్నవన్నీ మనదేశంలో ఉన్నాయి. మనదేశంలో లేనిది ప్రపంచంలో మరెక్కడా లేదు. గుజరాత్‌లోని కచ్ ప్రాంతం బొలీవియాను తలపిస్తుంది. మన దగ్గర ఎడారులు, హిమాలయాలు, బీచ్‌లు ఒక్కొక్కటి ఒక్కోదేశంలో ప్రత్యేకమైన టూరిస్ట్ ప్లేస్‌ను తలపిస్తాయి. ఆర్కిటెక్చర్ పరంగా తమిళనాడు ఆలయాలు, రాజస్థాన్ కోటలకు ప్రపంచంలో మరేవీ సాటి రావు.

– పానుగోటి నీలిమ, ట్రావెలర్, సాఫ్ట్‌వేర్ ఇంజనీర్

సురక్షితంగా వెళ్లిరావచ్చు!



ఒంటరి పర్యటనలు ఆస్వాదించే వారి సంఖ్య పెరుగుతోంది. కెనడాలో మాంట్రియల్‌లో నేను ప్రయాణించిన టూరిస్ట్ బస్‌లో తొమ్మిది దేశాల వాళ్లున్నారు. అంత మందిలో ఇద్దరు మినహా అంతా సోలో ట్రావెలర్సే. అయితే వెళ్లే ముందు పర్యటనకు వెళ్లే ప్రదేశం గురించి ప్రాథమిక వివరాలైనా తెలుసుకోవాలి. ఇప్పుడు ఇంటర్నెంట్, జీపీఎస్ సౌకర్యాలున్నాయి కాబట్టి స్మార్ట్ ఫోన్ ఉంటే చాలు, ధైర్యంగా ఒంటరి ప్రయాణాలు చేయవచ్చు. భద్రంగా వెళ్లి, సంతోషంగా తిరిగి రాగలిన పరిస్థితులున్నాయి.

– రజని లక్కా, సోషల్ యాక్టివిస్ట్

ట్రావెల్ లైట్... ట్రావెల్ సేఫ్

ఈశాన్య రాష్ట్రాలు మినహా దేశమంతటా పర్యటించాను. ఏడు దేశాలు కూడా చూశాను. మనల్ని మనం మరింత క్షుణ్ణంగా అర్థం చేసుకోగలిగింది పర్యటన ద్వారానే. సోలో ట్రావెల్ అయితే మన అభిరుచికి తగినట్లు టూరిస్ట్ ప్రదేశాలను ఎంచుకోవచ్చు. ఇప్పుడు పర్యటనలకు సౌకర్యాలు బాగున్నాయి. సోలో ట్రావెల్‌లో అన్నీ మనమే సమకూర్చుకోవడం కష్టం అనిపిస్తే టూర్ ప్యాకేజ్‌లో వెళ్లవచ్చు. ఎక్కడికి వెళ్తే ఆ ప్రదేశంలో స్థానికులతో కలిసిపోతున్నట్లుగా ఉండాలి. మనల్ని మనం ఎక్స్‌పోజ్ చేసుకునే ప్రయత్నం చేయరాదు. ఆ ప్రదేశానికి సరిపోలని వస్త్రధారణ, మాటల ద్వారా ఇతరుల దృష్టి మన మీద సులువుగా పడుతుంది. ప్రమాదాలు కూడా అక్కడి నుంచే మొదలవుతాయి. సోలో ట్రావెల్ చేసే మహిళలు జాగ్రత్తగా ఉండాల్సింది ఈ విషయంలో మాత్రమే.



– జెన్నిఫర్ ఆల్ఫాన్స్, డైరెక్టర్

– వాకా మంజులారెడ్డి, సాక్షి ఫీచర్స్ ప్రతినిధి

మీసాలు.. గడ్డాలకు భేషైన తైలాలు





మింగ మెతుకు లేదు గాని మీసాలకు సంపెంగ నూనె అని మనకో సామెత ఉంది. స్తోమతకు మించి డాబులొలికే దిలాసారాయుళ్ల తీరును ఎద్దేవా చేయడానికి పుట్టిన సామెత అది. ఆనాటి సమాజంలో సంపన్నులైన పెద్దమనుషులు మీసాలకు సంపెంగ నూనెలు, ఇతరేతర సుగంధ తైలాలను పూసుకుంటూ, దర్జా ప్రదర్శించేవారు. ఇదివరకు కాస్త వయసు మళ్లినవాళ్లే ఏవుగా గడ్డాలు పెంచేవాళ్లు. ఇటీవలి కాలంలో కుర్రాళ్లు కూడా ఎడాపెడా గడ్డాలు పెంచేసుకుంటున్నారు. కొందరు అడ్డదిడ్డంగా గడ్డాలు పెంచుకుంటూ, చిరిగిన జీన్స్ తొడుక్కుని వీధుల్లో ఆవారాగా తిరుగుతుంటే, ఇంకొందరు సూటు బూట్లు ధరించి, పద్ధతిగా గడ్డాలను రకరకాల తీరుల్లో కత్తిరించుకుంటూ, గడ్డాలు దట్టంగా పెరగడానికి నానా రకాల పోషక తైలాలు వాడుతున్నారు. గడ్డాల మీద యువతరం మోజు గమనించిన మార్కెట్ శక్తులు ఊరుకుంటాయా? యువకుల మోజును సొమ్ము చేసుకోవడానికి గడ్డాల పోషణకు ప్రత్యేకంగా రూపొందించిన రకరకాల తైలాలను మార్కెట్‌లో ముంచెత్తుతున్నాయి. బియర్డ్ ఆయిల్స్, బియర్డ్ క్రీమ్స్ పురుషుల సౌందర్య ఉత్పత్తులలో కీలకంగా మారిపోయాయి. తలకు రాసుకునే హెయిరాయిల్స్, బ్రిలియంటైన్స్, జెల్స్‌తో పోల్చుకుంటే మీసాలు గడ్డాలకు పూసుకునే బీర్డ్ ఆయిల్స్, క్రీమ్స్ ధరలు నాలుగైదు రెట్లు ఎక్కువగా ఉంటున్నా, గడ్డాలరాయుళ్లు ఏమాత్రం వెనుకాడటం లేదు.

మంచి ఆరోగ్యాన్ని తేగలవు



చలికాలం మొదలు కాగానే మార్కెట్లులో విరివిగా కనిపించే వాటిలో తేగలు ఒకటి. వీటిని కొన్ని ప్రాంతాలలో గేగులు అని అంటారు. వీటిని తినేందుకు కొందరు ఇష్టపడరు. అయితే తేగల్లో ఆరోగ్య పోషకాలు పుష్కలంగా వున్నాయి. అవేంటో తెలుసుకుంటే ఇప్పుడైనా వీటిని తినేందుకు త్వరపడతారు.

తేగలను ఉడికించి మిరియాలు, ఉప్పు అద్దుకుని తింటే ఆరోగ్యానికి ఎంతో మేలు. తేగలు తింటే బరువు తగ్గడంతోపాటు కాన్సర్ కూడా దూరం అవుతుంది. అలాగే తేగలను ఉడికించి చిన్న చిన్న ముక్కలుగా కట్ చేసుకుని పిండి కొట్టి, కొబ్బరిపాలు, బెల్లం, ఏలకుల పొడి చేర్చి తీసుకుంటే కొలెస్ట్రాల్ ఇట్టే కరిగిపోతుంది.

తేగలపిండితో రొట్టెలు చేసుకుని తినొచ్చు. ఇందులోని పీచు జీర్ణక్రియకు ఎంతగానో తోడ్పడుతుంది. పెద్ద పేగుల్లో మలినాలను చేరకుండా చేస్తుంది. టాక్సిన్లను తొలగిస్తుంది. ఇందులోని కాల్షియం ఎముకలకు బలాన్నిస్తుంది. మెదడు పనితీరును మెరుగుపరుస్తుంది. రక్తంలో తెల్ల కణాలను వృద్ధి చేస్తుంది. శరీరానికి చలువనిచ్చి, నోటిపూతను తగ్గిస్తుంది. తేగలను పాలలో ఉడికించి ఆ పాలను చర్మానికి పూతలా రాసుకుంటే చర్మం మిలమిలలాడుతుంది.

తేగలు దొరికే రోజుల్లో పిల్లలకు రెగ్యులర్‌గా వీటిని పెడితే ఎముకల ఎదుగుదలకు దోహద పడుతుంది. తాటి తేగలను మధుమేహం ఉన్న వారు కూడా తినవచ్చు. రక్తంలో చక్కెర స్థాయులను నియంత్రించి మధుమేహాన్ని అదుపు చేస్తుంది. రక్తం తక్కువగా ఉండి అనీమియాతో బాధపడుతున్నవారు ఈ సీజన్‌లో వచ్చే తేగలను తింటూ ఉంటే మంచి ఫలితం కనపడుతుంది. మంచిది కదా అని అతిగా తింటే మాత్రం చెరుపు చేస్తుంది.

● యోగా



ఎముకల బలానికి అధో ముఖం

ఎముకలు, కండరాలను బలోపేతం చేయడానికి, అకస్మాత్తుగా పడిపోయే ప్రమాదాన్ని నివారించగల శక్తి అధో ముఖానానికి ఉంది. రోజూ ఈ ఆసనాన్ని దినచర్యలో భాగం చేస్తూ ఉంటే మైండ్, బాడీ చురుకుదనం పెరుగుతుంది.

ఇలా వేయాలి....

● మ్యాట్ పైన లేదా నేలపైన నిటారుగా నిల్చొని చేతులను పైకి స్ట్రెచ్ ఉంచాలి. తర్వాత నడుం భాగం వంచుతూ, చేతులను పూర్తిగా నేలమీద ఆనించాలి. ● చేతులను పాదాలకు దూరంగా తీసుకెళుతూ త్రికోణాకారంలో ఉండాలి. ● కాలి వేళ్ల మీద ఉంటూ మడమలను పైకి లేపాలి. శరీర బరువు చేతులు, కాలి ముని వేళ్ల మీద ఉంటుంది. ● నిమిషం సేపు ఇదే భంగిమలో ఉండాలి. తిరిగి యథాస్థితికి రావాలి. ఇలా ఒకటి నుంచి 3 సార్లు ఈ ఆసనాన్ని పునరావృతం చేయాలి.

ఈ ఆసనం వేయటానికి మొదట్లో కాస్త కష్టంగా వున్నా రోజూ సాధన చేస్తూ ఉంటే సులువవుతుంది. వెన్నెముక, కాళ్ళను బలోపేతం చేస్తుంది. అదే విధంగా ఏకాగ్రత పెంచి, ఒత్తిడి నుండి రిలీఫ్‌ని ఇస్తుంది. అజీర్తి సమస్యలు దూరమవుతాయి. నడుము నొప్పి తగ్గుతుంది. ఆస్టియోపోరోసిస్ సమస్య నుండి రక్షిస్తుంది. సైనస్, ఆస్తమా, పీరియడ్స్‌లో వచ్చే సమస్యల నుంచి రిలీఫ్‌ని ఇస్తుంది. ఇన్ని ప్రయోజనాలని ఈ ఆసనం ద్వారా పొందవచ్చు.

సాక్షి సినిమా

టాక్సిక్‌లో ఫిక్స్

'కేజీఎఫ్: చాప్టర్ 1, కేజీఎఫ్: చాప్టర్ 2' వంటి చిత్రాలతో రాఖీ భాయ్‌గా పాన్ ఇండియా స్థాయిలో ఎంతో గుర్తింపు సొంతం చేసుకున్నారు యశ్. ఆ సినిమాల తర్వాత యశ్ హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'టాక్సిక్: ఏ ఫెయిరీటేల్ ఫర్ గ్రోన్‌అప్స్'. ఈ చిత్రానికి మలయాళ దర్శకురాలు గీతూ మోహన్‌దాస్ దర్శకత్వం వహిస్తున్నారు. వెంకట్ కె. నారాయణ, యశ్ నిర్మిస్తున్న ఈ సినిమా చిత్రీకరణ కొన్నాళ్లుగా జరుగుతోంది. అయినప్పటికీ హీరోయిన్ ఎవరనే విషయంపై చిత్రయూనిట్ ఎలాంటి ప్రకటన చేయలేదు. ఈ నేపథ్యంలో కియారా అద్వానీ, కరీనా కపూర్, నయనతార వంటి హీరోయిన్ల పేరు తెరపైకి వచ్చాయి. ఫైనల్‌గా యశ్‌కి జోడీగా నయనతార నటిస్తున్నట్లు ఈ మూవీలో కీలక పాత్ర చేస్తున్న బాలీవుడ్ నటుడు అక్షయ్ ఒబెరాయ్ మాటలతో స్పష్టత వచ్చింది. తాజాగా ఓ ఇంటర్వ్యూలో అక్షయ్ ఒబెరాయ్ మాట్లాడుతూ– ''యశ్ హీరోగా నటిస్తున్న 'టాక్సిక్' సినిమా షూటింగ్‌తో ప్రస్తుతం బిజీగా ఉన్నాను. ఇందులో నయనతార కూడా భాగమయ్యారు. ఇంతకు మించి వివరాలను నేను ఇప్పుడే వెల్లడిస్తే బాగోదు కాబట్టి నన్ను ఎక్కువగా అడగకండి. త్వరలోనే గీతూ మోహన్‌దాస్ ఓ ప్రకటన చేస్తారు. అప్పటివరకు వేచి చూడండి'' అని పేర్కొన్నారు. ఇక నయనతార గురించి దర్శక–నిర్మాతల నుంచి అధికారిక ప్రకటన రావడమే ఆలస్యం. ఈ చిత్రం ఏప్రిల్ 10న విడుదల కానుంది.



● నయనతార

వేసవిలో జాట్



● సన్నీ డియోల్

బాలీవుడ్ నటుడు సన్నీ డియోల్ హీరోగా టాలీవుడ్ దర్శకుడు గోపీచంద్ మలినేని తెరకెక్కించిన హిందీ చిత్రం 'జాట్'. రణదీప్ హుడా, వినీత్ కుమార్ సింగ్, సయామీ ఖేర్, రెజీనా కసాండ్రా ఇతర పాత్రల్లో నటించారు. మైత్రీ మూవీ మేకర్స్, పీపుల్ మీడియా ఫ్యాక్టరీ పతాకాలపై నవీన్ యెర్నేని, వై. రవిశంకర్, టీజీ విశ్వప్రసాద్ నిర్మించిన ఈ చిత్రం రిలీజ్ డేట్ ఫిక్స్ అయింది. ఈ చిత్రాన్ని వేసవిలో ఏప్రిల్ 10న విడుదల చేయనున్నట్లు శుక్రవారం ప్రకటించి, కొత్త పోస్టర్ విడుదల చేశారు. ''భారీ యాక్షన్ మూవీగా 'జాట్' రూపొందింది. 'పుష్ప 2: ది రూల్' సినిమాతో పాటు ప్రపంచవ్యాప్తంగా 12,500 స్క్రీన్లలో ప్రదర్శితమైన 'జాట్' టీజర్‌కి అద్భుతమైన స్పందన లభించింది. ఈ చిత్రంలోని యాక్షన్ సన్నివేశాలు ప్రేక్షకులను కట్టిపడేస్తాయి'' అని యూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి సంగీతం: తమన్, కెమేరా: రిషి పంజాబీ, సీఈఓ: చెర్రీ, ఎగ్జిక్యూటివ్ నిర్మాతలు: బాబా సాయికుమార్ మామిడిపల్లి, జయ ప్రకాశ్ రావు (జేపీ).

అంతే తేడా!

'ఇట్స్ ఓకే.. మూవ్ ఆన్ అవ్వాలిరా.. తప్పదు' అంటూ అనంతిక సనీల్‌కుమార్ చెప్పిన డైలాగ్‌తో '8 వసంతాలు' మూవీ టీజర్ ఆరంభమైంది. 'మ్యాడ్' మూవీ ఫేమ్ అనంతిక సనీల్‌కుమార్ లీడ్ రోల్‌లో నటించిన తాజా చిత్రం '8 వసంతాలు'. ఫణీంద్ర నర్సెట్టి దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో హను రెడ్డి, రవితేజ దుగ్గిరాల, సంజన, కన్నా పసునూరి, స్వరాజ్ రెబ్బా ప్రగడ, సమీరా కిశోర్ ఇతర పాత్రలు పోషించారు. మైత్రీ మూవీ మేకర్స్‌పై నవీన్ యెర్నేని, వై. రవిశంకర్ నిర్మించిన ఈ సినిమా టీజర్‌ని శుక్రవారం రిలీజ్ చేశారు. ''ఎవరి తుఫాన్‌లు వారికి ఉంటాయి లోపల... కొందరు బయట పడతారు, ఇంకొందరు ఎప్పటికీ పడరు... అంతే తేడా'' అంటూ కన్నా పసునూరితో అనంతిక సనీల్ కుమార్ చెప్పే డైలాగ్స్ కూడా టీజర్‌లో ఉన్నాయి. త్వరలో విడుదల కానున్న ఈ చిత్రానికి సంగీతం: హేషమ్ అబ్దుల్ వహాబ్, కెమేరా: విశ్వనాథ్ రెడ్డి.



● రవితేజ, అనంతిక

అఖండలో...



● సంయుక్తా మీనన్

'సింహా, లెజెండ్, అఖండ' వంటి హిట్ సినిమాల తర్వాత హీరో బాలకృష్ణ, డైరెక్టర్ బోయపాటి శ్రీను కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న చిత్రం 'అఖండ 2: తాండవం'. ఈ మూవీలో హీరోయిన్‌గా సంయుక్తా మీనన్ ఎంపికయ్యారు. ఈ విషయాన్ని చిత్రయూనిట్ శుక్రవారం అధికారికంగా ప్రకటించింది. ఎం. తేజస్విని సమర్పణలో 14 రీల్స్ ప్లస్ బ్యానర్‌పై రామ్ ఆచంట, గోపీ ఆచంట నిర్మిస్తున్నారు. ఈ సినిమా చిత్రీకరణ ప్రస్తుతం మహా కుంభమేళాలో జరుగుతోంది. సినిమాలోని కీలక సీన్స్ షూట్ చేస్తున్నారు. అయితే ఇప్పటివరకూ హీరోయిన్ ఎవరు? అనే విషయంపై చిత్రబృందం ప్రకటించలేదు. తాజాగా సంయుక్తా మీనన్ హీరోయిన్‌గా ఎంపిక అయినట్లు మేకర్స్ ప్రకటించారు. సెప్టెంబర్ 25న ఈ చిత్రం విడుదల కానుంది. ఈ చిత్రానికి సంగీతం: తమన్, కెమేరా: సి. రాంప్రసాద్, సంతోష్ డి.


వెంకటలచ్చిమి ప్రతీకారం



● పాయల్ రాజ్‌పుత్

'ఆర్‌ఎక్స్ 100, వెంకీ మామ, డిస్కో రాజా, అనగనగా ఓ అతిథి, మంగళవారం' వంటి పలు సినిమాల్లో నటించి, తనకంటూ ప్రత్యేక గుర్తింపు సొంతం చేసుకున్నారు పాయల్ రాజ్‌పుత్. తాజాగా ఆమె ప్రధాన పాత్రలో 'వెంకటలచ్చిమి' అనే పాన్ ఇండియా చిత్రం ఆరంభమైంది. ముని దర్శకత్వంలో సినిమా టికెట్ ఎంటర్‌టైన్‌మెంట్స్‌పై రాజా, ఎన్‌ఎస్ చౌదరి నిర్మిస్తున్నారు. ఈ చిత్రం ప్రారంభోత్సవం అనంతరం ముని మాట్లాడుతూ– ''వెంకటలచ్చిమి' కథ అనుకున్నప్పుడే పాయల్ రాజ్‌పుత్ సరిగ్గా సరిపోతారనిపించింది. గిరిజన ప్రాంతానికి చెందిన వెంకటలచ్చిమి అనే అమ్మాయి ప్రతీకారం, యాక్షన్ నేపథ్యంలో ఈ మూవీ ఉంటుంది. ఈ సినిమాని తెలుగుతో పాటు హిందీ, పంజాబీ, కన్నడ, మలయాళ, తమిళ భాషల్లో తెరకెక్కిస్తున్నాం'' అని తెలిపారు. పాయల్ రాజ్‌పుత్ మాట్లాడుతూ– ''మంగళవారం' సినిమా తర్వాత ఎన్నో కథలు విన్నా, నచ్చకపోవడంతో తిరస్కరించాను. మునిగారు 'వెంకటలచ్చిమి' కథ చెప్పగానే చాలా నచ్చేసింది. ఈ చిత్రం తర్వాత నా పేరు వెంకటలచ్చిమిగా స్థిరపడిపోతుందేమో అనేంత బలమైన కథ ఇది'' అని పేర్కొన్నారు. ఈ చిత్రానికి సంగీతం: వికాస్ బడిశా.

ప్రేమ కోసం...



● విరాజ్ రెడ్డి

విరాజ్ రెడ్డి చీలం హీరోగా నటించిన చిత్రం 'గార్డ్'. రివెంజ్ ఫర్ లవ్ (ప్రేమకోసం ప్రతీకారం) అనేది ఉపశీర్షిక. జగ పెద్ది దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో మిమీ లియానార్డ్, శిల్పా బాలకృష్ణ హీరోయిన్లుగా నటించారు. అనసూయ రెడ్డి నిర్మించిన ఈ మూవీ ఫిబ్రవరిలో విడుదల కానుంది. శుక్రవారం ఈ చిత్రం టీజర్‌ని రిలీజ్ చేశారు. ''హారర్, థ్రిల్లర్ అంశాలతో రూపొందిన చిత్రం 'గార్డ్'. సుశాంత్ అనే సెక్యూరిటీ గార్డుగా విరాజ్ కనిపిస్తారు. విరాజ్ యాక్షన్, డైలాగ్ డెలివరీ ఆకట్టుకునేలా ఉంటాయి. యాక్షన్–ప్యాక్డ్ డ్రామాగా తెరకెక్కిన ఈ సినిమాలో లవ్ ట్రాక్ కూడా ఉంటుంది. ప్రేమ పేరుతో ఊహించని శక్తులపై హీరో చేసే పోరాటాలు ఈ సినిమాకు హైలెట్'' అని యూనిట్ పేర్కొంది.

ఓటీటీ – ఇది చూడొచ్చు

బీ కేర్‌ఫుల్...

ఓటీటీలో ఇది చూడొచ్చు అనే ప్రాజెక్ట్స్ చాలా ఉంటాయి. ప్రస్తుతం స్ట్రీమ్ అవుతున్న వాటిలో హాలీవుడ్ చిత్రం డేంజరస్ వాటర్స్ ఒకటి. ఈ చిత్రం గురించి తెలుసుకుందాం.



జీవితమన్నది క్షణభంగురం. ఏ క్షణానికి ఏమి జరుగుతుందో ఎవరూ ఊహించలేరు. కాబట్టి అనుక్షణం అప్రమత్తత అవసరం. ఈ నేపథ్యంలోనే రూపొందిన హాలీవుడ్ సినిమా 'డేంజరస్ వాటర్స్'. ఇదో పూర్తి థ్రిల్లర్ జోనర్ మూవీ. సినిమా మొత్తం ఓ మూడు పాత్రలతో 90 శాతం సముద్రంలోనే జరిగిన కథ. సినిమాలో ఉన్నది మూడు పాత్రలే అయినా మంచి స్క్రీన్‌ప్లేతో చూసే ప్రేక్షకులను మాత్రం కట్టిపడేసే ప్రయత్నం చేశారు దర్శకుడు జాన్ బర్. ఈ సినిమా లయన్స్ గేట్ ఓటీటీ వేదికగా స్ట్రీమ్ అవుతోంది. ఇది పెద్దవాళ్లు మాత్రమే చూసే సినిమా. ఇక ఈ చిత్రకథ విషయానికొస్తే... అల్మా తన కూతురు కోసం ఓ సూపర్ వెకేషన్ ప్లాన్ చేస్తుంది. తన బాయ్ ఫ్రెండ్ డెరెక్‌తో కలిసి కూతురుతో పాటు బోట్‌లో బెర్ముడా వరకు ట్రావెల్ చేసి, సముద్రం మధ్యలో తన బర్త్ డే సెలబ్రేట్ చేసుకోవాలన్నది ప్లాన్. దీనికి కూతురు రోజ్ అయిష్టంగానే ఒప్పుకుంటుంది. ప్రయాణం మొదలైనపుడు అంతా బాగానే ఉంటుంది. దారి మధ్యలో వేరే ఒక బోట్ వీళ్లకు ఎదురుగా వచ్చి అల్మాను చంపేసి డెరెక్‌ను గాయపరుస్తారు. అనుకోకుండా జరిగిన ఈ సంఘటనలో నడి సంద్రంలో రోజ్ ఒంటరిదైపోతుంది. దాడి చేయడానికి వచ్చినవాళ్లు బోట్‌లోని రేడియోను అలాగే బోట్ ఇంజన్‌ను ధ్వంసం చేసి వెళతారు. చుట్టూ నీళ్ల తప్ప ఏమీ లేని ఆ ప్రాంతం నుండి రోజ్ ఎలా బయటపడిందనేది సినిమాలోనే చూడాలి. ఈ సినిమా చాలా నెమ్మదిగా ప్రారంభమై, ఉత్కంఠభరితంగా సాగుతూ ఊహకందని క్లైమాక్స్ ట్విస్టులతో అద్భుతంగా ముగుస్తుంది. గంటా నలభై నిమిషాల నిడివితో సాగే ఈ సినిమా ఎక్కడా బోర్ కొట్టదు. థ్రిల్లర్ జోనర్ ఇష్టపడేవాళ్లకి ఇదో సూపర్ సినిమా. మరింకేం... ఈ వీకెండ్ 'డేంజరస్ వాటర్స్'లోకి మీరూ ట్రావెల్ చేయండి.

– ఇంటూరు హరికృష్ణ